సాక్షి జగిత్యాల

మంగళవారం : 10 : అక్టోబర్ : 2023



కోడ్‌తో ఫ్లెక్సీల తొలగింపు

మెట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో మెట్‌పల్లి పట్టణంలో పలు చోట్ల ఉన్న ప్రభుత్వ ప్రచార బోర్డులను మున్సిపల్ సిబ్బంది తొలగించి కార్యాలయానికి తరలించారు.



పత్తికి తెగుళ్ల బెడద

గత రెండు, మూడేళ్లుగా కురుస్తున్న అధిక వర్షాలు, ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితులతో పత్తి పంటను తెగుళ్లు ఆశించి, రైతులు నష్టపోతున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొడి వాతావరణం ఏర్పడుతుంది. వర్షం కురిసే అవకాశం తక్కువగా ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిగా నీలిమ



కలెక్టర్‌ను కలిసిన నీలిమ

జగిత్యాల: జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిగా నీలిమ నియమితులయ్యారు. జగిత్యాల జిల్లాకేంద్రంగా అవతరించినప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. అప్పటినుంచి ఉమ్మడి జిల్లా నుంచే పాలన సాగేది. ఈ క్రమంలో మంచిర్యాలలో పనిచేస్తున్న నీలిమను ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సోమవారం ఆమె కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు.

గ్రీవెన్స్ డే తో బాధితులకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ప్రభాకర్

జగిత్యాలక్రైం: వివిధ సమస్యలతో పోలీసులను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం చేసేలా చర్యలు తీసుకునేందుకు గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 11 మంది దరఖాస్తులు స్వీకరించారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. భూ సమస్యల విషయంలో అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ చేసి, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

సంక్షేమ అధికారికి అభినందనలు



అభినందిస్తున్న టీఎన్జీవో నాయకులు

జగిత్యాల: జిల్లా సంక్షేమ అధికారిగా ఆడెపు భాస్కర్ నియమితులు కావడంతో టీఎన్జీవో నాయకులు ఆయనను అభినందించారు. భాస్కర్ మాట్లాడుతూ.. ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి జిల్లాను ముందువరుసలో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి నాగేందర్, రవీందర్, మధుకర్, నుగుణాకర్, రాజేశం పాల్గొన్నారు. భాస్కర్ కామారెడ్డిలో వెటర్నరీ శాఖలో ఏడీగా పనిచేస్తున్నారు. ఫారిన్ సర్వీస్‌లో భాగంగా ఇక్కడకు బదిలీపై వచ్చారు.

కేసీ కెనాల్‌కు 6,400 క్యూసెక్కుల నీటి విడుదల



డీ-53 కాలువకు విడుదలవుతున్న నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 6400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 8,098 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 6400 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 200, సరస్వతి కెనాల్‌కు 500, అలీసాగర్ ఎత్తిపోతలకు 180, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

ఈ-పంచాయతీ ఆపరేటర్ల సమ్మె విరమణ

జగిత్యాలటౌన్: ఉద్యోగ భద్రతతోపాటు పలు డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ పదిరోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఈ పంచాయతీ ఆపరేటర్లు విరమిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పంచాయతీ అధికారికి లేఖ అందించారు. ఈ పంచాయతీ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు హామీ, రాష్ట్ర కమిటీ ఆదేశాలతో విధుల్లో చేరుతున్నట్లు ప్రకటించారు.

అసెంబ్లీ ఆట మొదలు

- ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో వేడెక్కిన రాజకీయం
- ప్రచారంలో ముందున్న బీఆర్‌ఎస్
- ఇంకా అభ్యర్థులను ప్రకటించని ఇతర పార్టీలు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అమల్లోకి కోడ్



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు సైరన్ మోగిస్తూ ఎన్నికల కమిషన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి తక్షణమే అమల్లోకి వచ్చింది. ఇక నుంచి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమావేశాలు జరుపరాదు. ఆన్ గోయింగ్ స్కీంలను కొనసాగించవచ్చు. ఎన్నికల తంతు అధికారికంగా ప్రారంభం కావడంతో పల్లెల్లో, పట్టణాల్లో ప్రచార పర్వం మొదలు కానుంది. ఇప్పటికే అధికార పార్టీ బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రచారం ప్రారంభించింది. నెల రోజుల కిందే అభ్యర్థులను ప్రకటించడంతో 10 రోజులుగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో తమను గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బీసీ చేయూత పథకం, గృహలక్ష్మి, మైనారిటీ, క్రిస్టియన్ బంధు పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందించే కార్యక్రమాలను ముమ్మరం చేశారు. పెండింగ్ పనుల పూర్తి, హామీలతో ముందుకెళ్తున్నారు. ఇప్పటికే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించి, పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపారు.

అభ్యర్థులను ప్రకటించని కాంగ్రెస్, బీజేపీ

శాసనసభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, అధికార పార్టీని ఎలాగైనా దెబ్బతీయాలని చూస్తున్న కాంగ్రెస్, బీజేపీలు ఇప్పటివరకు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. దీంతో క్షేత్రస్థాయిలో ఆయా పార్టీల కేడర్‌లో నైరాశ్యం నెలకొంది. పార్టీలపై ప్రజల్లో సానుభూతి ఉన్నా అనుకూలంగా మలుచుకోవడంలో విఫలమవుతున్నారన్న భావన ఉంది. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరించినా ఖరారు చేయలేదు. ఢిల్లీ, హైదరాబాద్ స్థాయిలో టికెట్లను ఆశిస్తున్న నేతలు పైరవీల్లో మునిగిపోయి, అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. మిగతా పార్టీల విషయానికొస్తే.. బహుజన్ సమాజ్ పార్టీ ఉమ్మడి జిల్లాలో నాలుగు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. జనసేన పార్టీ ఐదు సీట్లలో పోటీ చేస్తామని నియోజకవర్గాల పేర్లను ప్రకటించిందే తప్ప అభ్యర్థులను వెల్లడించలేదు.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నోటిఫికేషన్	నవంబర్ 3
నామినేషన్లకు ఆఖరు తేదీ	నవంబర్ 10
నామినేషన్ల పరిశీలన	నవంబర్ 13
ఉపసంహరణకు ఆఖరు తేదీ	నవంబర్ 15
పోలింగ్ తేదీ	నవంబర్ 30
ఓట్ల లెక్కింపు	డిసెంబర్ 3

3.2 లక్షలు పెరిగిన ఓటర్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 31,12, 283 మంది ఓటర్లు ఉన్నారని తాజా గణాంకాలు చెబుతున్నాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27,88,085 మంది ఓటర్లు ఉండగా.. తాజాగా ఆ సంఖ్య 31.12 లక్షలు దాటింది. మొత్తంగా చూసినప్పుడు ఐదేళ్ల క్రితానికి ఇప్పటికి 3,24,198 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో యువతే ఎక్కువ మంది ఉన్న నేపథ్యంలో దాదాపు అన్ని పార్టీలు వారిని లక్ష్యంగా చేసుకొని, మేనిఫెస్టో, ప్రచారానికి రూపకల్పన చేస్తున్నాయి.

ఇవి చేయడానికి వీల్లేదు..

- కోడ్ అమల్లోకి వచ్చినందున మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారిక పర్యటనలు చేయరాదు.
- ప్రభుత్వ పథకాలు, ప్రచారాల పోస్టర్లు, ఫ్లెక్సీలను తొలగిస్తారు. ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది.
- ఎన్నికల షెడ్యూల్ వెలువడిన రోజు నుంచే ప్రతి అభ్యర్థి ఖర్చుపై నిఘా ఉంటుంది.
- కొత్త పథకాల ప్రకటన, మౌలిక సదుపాయాల కల్పనపై ఎలాంటి హామీలు ఇవ్వకూడదు. అధికారిక వాహనాల వినియోగంపై పరిమితులు ఉంటాయి.
- నగదు రవాణా విషయంలో బంగారం, వర్తక, బ్యాంకింగ్ అధికారులతోపాటు సామాన్యులు, రైతులు అప్రమత్తంగా ఉండాలి. అన్నింటికీ కావాల్సిన ఇన్వాయిస్, బిల్లులు దగ్గర పెట్టుకోవాలి.
- లైసెన్స్‌డ్ ఆయుధాలన్నీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో సరెండర్ చేయాలి. ప్రార్థనా స్థలాల వద్ద ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు.
- ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఎలాంటి కానుకలు, డబ్బు, మద్యం పంచకూడదు.
- రాజకీయ విమర్శలు చేసే క్రమంలో వర్గాన్ని, నాయకుడిని ఉద్దేశిస్తూ.. విద్వేష వ్యాఖ్యలు చేయరాదు.
- ర్యాలీలు, సభల విషయంలో అధికారుల అనుమతి తీసుకోవాలి. నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి.

పకడ్బందీగా ఏర్పాట్లు..!

- సిబ్బందికి శిక్షణ
- ఎన్నికల నియామవళి ప్రకారం విధులు
- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జిల్లాలో ఎన్నికల నిబంధనలు, నియామవళి ప్రకారం ముందుకెళ్తామని కలెక్టర్ యాస్మిన్‌బాషా స్పష్టం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని, ఇప్పటికే ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. యంత్రాంగాన్ని సమాయత్తం చేశామన్నారు. సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు.



కలెక్టర్ యాస్మిన్ బాషా

సాక్షి: ఎన్నికల నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

కలెక్టర్: ఎన్నికల కోసం అన్ని విధాలా సిద్ధమయ్యాం. పకడ్బందీగా ముందుకెళ్తాం. ఎన్నికల నియామవళి ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం.

సాక్షి: జిల్లాలో ఓటరు శాతం పెరిగిందా?

కలెక్టర్: ముఖ్యంగా యువత ఓటింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకున్నాం. 18 నుంచి 19ఏళ్ల వారు 21,025 మంది నమోదు చేసుకున్నారు. 20 నుంచి 29 ఏళ్ల యువత 1,40,622 మంది ఉన్నారు. మొత్తంగా జిల్లాలో 6,87,952 మంది ఓటర్లు ఉన్నారు.

సాక్షి: ఓటుహక్కు వినియోగంపై..?

కలెక్టర్: ఓటు ఎలా వేయాలో.. వేయించాలో సంబంధిత గ్రామాలకు ఎన్నికల సిబ్బంది వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరికీ ఓటు ప్రాముఖ్యతను వివరించేలా చర్యలు తీసుకున్నాం.

సాక్షి: సమస్యాత్మక కేంద్రాల వద్ద ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

కలెక్టర్: నియోజకవర్గాల్లో 248 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. సాధారణ కేంద్రాలుగా 682 గుర్తించాం. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చూస్తాం.

సాక్షి: సమస్యలుంటే ఫిర్యాదు ఎలా..?

కలెక్టర్: ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1950 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకొచ్చాం. ఆ నంబర్‌కు ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

సాక్షి: దివ్యాంగుల కోసం తీసుకుంటున్న చర్యలు..?

కలెక్టర్: జిల్లాలో దివ్యాంగులు ప్రశాంతంగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవకాశం కల్పిస్తున్నాం. జిల్లాలో 32,342 మంది ఉన్నారు. 80 ఏళ్ల వయస్సువారు 12,077 మంది ఉన్నారు.

పోలీస్ శాఖ అలర్ట్





చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

- జిల్లాలో ఏడు చెక్‌పోస్టుల ఏర్పాటు
- రూ.50వేలకు మించి నగదు ఉంటే సీజ్..
- ఎస్పీ ఎగ్గడి భాస్కర్ వెల్లడి

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లా పోలీసు శాఖ అలర్ట్ అయ్యింది. జిల్లా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు చేపట్టేలా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసింది. పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను చెక్‌పోస్టుల వద్ద తనిఖీ చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా సరిహద్దుల్లో ఏడుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. సోమవారం నుంచి అన్ని చెక్‌పోస్టుల్లో తనిఖీలు ప్రారంభించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ఉండాలి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల అమలులో పోలీసుల పాత్ర కీలకమని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధులకు సంబంధించి పోలీస్ సెక్టార్ అధికారులను నియమించామని, పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఒకటికి రెండుసార్లు విషయాలు తెలుసుకొని పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా డబ్బు, మద్యం, గిఫ్ట్స్, గంజాయి వంటి ఇతర ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ప్రభాకరరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, ఆరిఫ్ అలీఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు ఇవే..

- మెట్‌పల్లి శివారు గండి హనుమాన్ ఆలయం వద్ద
- రాయికల్ మండలం బోర్నపల్లి బ్రిడ్జి వద్ద
- మల్లాపూర్ మండలం ఒబులాపూర్ బ్రిడ్జి వద్ద
- బీర్‌పూర్ మండలం కమ్మునూర్ వద్ద
- ధర్మపురి మండలం రాయపట్నం వద్ద
- కొడిమ్యాల మండలం దొంగలమర్రి వద్ద
- కథలాపూర్ మండలం కలికోట వద్ద
- రూ.50 వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేస్తారు.
- రూ.50వేలకు మించి నగదు ఉంటే ఆ డబ్బుకు సంబంధించిన పూర్తి ఆధారాలు చూపాలి.





ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు

ధర్మపురి: పట్టణంలో బొడ్డెమ్మ ఊరేగింపు వేడుకలను సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మహిళలు వివిధ పూలతో బొడ్డెమ్మను తయారు చేసి నంది కూడలి వద్ద ఆటలు ఆడారు. అనంతరం గోదావరి నదికి ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ కూతురు నందిని, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, జెడ్పీటీసీ బత్తిని అరుణ, కౌన్సిలర్లు, గంగపుత్ర మహిళలు తదితరులున్నారు.

ప్రజావాణిలో 'డబుల్' రగడ

- అర్హులకు న్యాయం చేస్తామన్న కలెక్టర్
- డబుల్ దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు
- ప్రజావాణికి పెద్ద ఎత్తున తరలివచ్చిన దరఖాస్తుదారులు
- అర్హులకు అన్యాయం చేసి అనర్హులకు ఇళ్లు ఇచ్చారంటూ ఆగ్రహం



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా


జగిత్యాలటౌన్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి డబుల్ ఇళ్లు లభించని దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో ప్రజావాణి ప్రాంగణం కిక్కిరిసిపోయింది. డబుల్ ఇళ్ల కేటాయింపులో ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవకతవకలకు పాల్పడటంతోపాటు అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల నిర్వాకంతో నిజమైన అర్హత కలిగిన తమకు ఇళ్లు రాకుండా పోయాయని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలను కాదని సొంతిళ్లు, భవంతులు ఉన్న వారికే డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడిటోరియం బయట ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి ఇద్దరు ఆర్డీవో స్థాయి అధికారులను డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాని దరఖాస్తుదారుల అభ్యంతరాలను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు.

జాగ పోయింది



జగిత్యాల అర్బన్ హౌసింగ్ స్కీం కింద 2007లో ఇంటి స్థలం మంజూరైంది. ఇంటి నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదు. ఇల్లు కేటాయిస్తామన్నరు. జాగా పోయింది.. ఇల్లు రాలేదు. - బాలె రాజమ్మ

అద్దెకుంటున్నా..



నాకు భర్త లేడు. పిల్లలతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న. మూడుసార్లు దరఖాస్తు చేసినా ఇల్లు ఇవ్వలేదు. పేదరికంతో అద్దె కూడా చెల్లించలేని స్థితిలో ఉన్నాను. నా పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇల్లు కేటాయించాలి.

- షేక్ నగ్మా

దరఖాస్తు తిరస్కరించారు



నేను అద్దె ఇంట్లో ఉంటున్నా సొంత ఇల్లు ఉందని నా దరఖాస్తును తిరస్కరించారు. ఇల్లు ఉన్న వాళ్లకే తిరిగి ఇల్లు కేటాయిస్తున్నరు. అధికారులు అర్హురాలైన నాకు న్యాయం చేయాలి.

- మిట్టు లత, హన్మాన్‌వాడ

ఇల్లు ఇస్తామన్నరు



నాకు 2008లో రాజీవ్ అర్బన్ కాలనీలో స్థలం ఇచ్చారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ సమయంలో ఆ స్థలం స్వాధీనం చేసుకుని ఇల్లు ఇస్తామన్నరు. ఇప్పుడు ఇవ్వకుండ అన్యాయం చేసిండ్రు.

- మహ్మద్ అజ్మా

ఏ ఆధారమూ లేదు



ఏ ఆధారమూ లేని నేను కూరగాయలు అమ్మి పిల్లలను పోషించుకుంటున్నాను. ఇంటి కిరాయి కూడా చెల్లించే స్థితిలో లేను. నా పేదరికాన్ని దృష్టిలో ఉంచుకుని ఇల్లు కేటాయించాలి.

- సయ్యద్ పర్వీన్, విద్యానగర్ జగిత్యాల

కళాకారుల పెంఛన్ ఇవ్వండి



చిందు, యక్షగాన కళలో అనేక పాత్రలు పోషించి మెప్పించాను. ప్రస్తుతం వయోభారంతోపాటు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. కలెక్టరమ్మ చొరవ తీసుకుని కళాకారుల పెన్షన్ మంజూరు చేయాలి.

- గడ్డం నల్లకొండయ్య, కోరుట్ల

క్లుప్తంగా

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు ఎమ్మెల్సీ సంఘీభావం



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్‌: బకాయిల విడుదల, పెంచిన వేతనాలు అమలు చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. 14రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు సోమవారం ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ప్రధాన కార్యదర్శి ఎండి ముఖ్రం, నాయకులు హనుమంతు, వెన్న మహేశ్‌ పాల్గొన్నారు.

గొల్లపల్లి తహసీల్దార్‌గా అరిఫొద్దీన్‌



గొల్లపల్లి: గొల్లపల్లి తహసీల్దార్‌గా ఎండీ.అరిఫొద్దీన్‌ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇప్పటివరకు పనిచేసిన రవికాంత్‌ కొడిమ్యాల మండలానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో పనిచేస్తున్న అరిఫొద్దీన్‌ను ఇక్కడకు బదిలీపై వచ్చారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందేలా కృషి చేస్తానని అన్నారు.

ఇళ్ల అక్రమాలపై విచారణ జరుపుతాం

- హౌసింగ్‌ డీఈ రాజేశ్వర్‌

సాక్షి ఎఫెక్ట్‌..

జగిత్యాల: జగిత్యాలలో డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల అక్రమాలపై విచారణ జరుపుతామని హౌసింగ్‌ డీఈ రాజేశ్వర్‌ తెలిపారు. ఇప్పటికే హౌసింగ్‌ శాఖలో పనిచేస్తున్న డాటా ఎంట్రీ ఆపరేటర్‌ రాకేశ్‌ను విధుల్లో నుంచి తొలగించామన్నారు. 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనాలకు సోమవారం ఆయన స్పందించారు. ఆపరేటర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, అతనికి సహకరించిన మీసేవ కంప్యూటర్‌ ఆపరేటర్‌పై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు. విచారణ అనంతరం అనుమతి లేకుండా నమోదు చేయబడిన అనర్హుల మంజూరు పత్రాలను రద్దు చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బెల్ట్‌ షాపులపై పోలీసుల దాడులు

కథలాపూర్‌: పెగ్గెర్ల, ఊట్‌పెల్లి గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌ షాపులపై పోలీసులు సోమవారం రాత్రి దాడులు చేశారు. రూ.39 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్‌ తెలిపారు. ఇద్దరు నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు

రాయికల్‌: అయోధ్య గ్రామంలో ఎలాంటి అనుమతి లేకుండా బెల్టుషాపు నిర్వహిస్తున్న మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్‌ తెలిపారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడన్న సమాచారంతో సోమవారం దాడి చేసి, రూ.7,570 విలువ గల మద్యం బాటిళ్లను సీజ్‌ చేసినట్లు పేర్కొన్నారు.

పత్తికి తెగుళ్ల బెడద

- పెరుగుతున్న కలుపు మొక్కలు
- ఎదగని పంట
- ఆకు ముడత, తెల్ల, పచ్చదోమల విజృంభణ
- రసాయనాలు పిచికారీ చేస్తున్న రైతులు
- జిల్లాలో 18,487 ఎకరాల్లో సాగు



పత్తి పంటపై రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

జగిత్యాల అగ్రికల్చర్‌: గత రెండు, మూడేళ్లుగా కురుస్తున్న అధిక వర్షాలు, ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితులతో పత్తి పంటను తెగుళ్లు ఆశించి, రైతులు నష్టపోతున్నారు. ఏటా దిగుబడులు తగ్గుతుండగా పెట్టిన పెట్టుబడైనా దక్కుతుందా అని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది పత్తి దిగుబడులు తగ్గితే దానికి ప్రధాన కారణం వర్షాలేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌లలో అధిక వర్షం

జగిత్యాల జిల్లాలో గత జూలై, ఆగస్టు, సెప్టెంబర్‌ రెండో వారం వరకు మోస్తరుగా కురవాల్సిన వర్షాలు, భారీగా పడ్డాయి. ఫలితంగా పత్తి పంట నీట మునిగి, ఆకులు పసుపు పచ్చగా మారడంతోపాటు మొక్కలు గిడసబారి, చనిపోయాయి. పంటలో నీరు నిలిచి, నేలలో ఆక్సిజన్‌ శాతం తగ్గిపోయి, మొక్కల వేర్లకు సూక్ష్మజీవుల నుంచి విడుదలైన విషపూరిత వాయువులు ఎక్కువగా చేరి, నష్టం చేశాయని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. దీనికి తోడు ఆకుముడత, తెల్ల, పచ్చ దోమల విజృంభణతోపాటు పురుగులు కాయలపై రంధ్రాలు చేయడంతో అవి రాలిపోతున్నాయని అంటున్నారు. అనుకున్న స్థాయిలో దిగుబడి రాదేమోనని ఆందోళన చెందుతున్నారు.

దిగుబడిపై ఆశల్లేవంటున్న రైతులు

జిల్లాలో రైతులు 18,487 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం ఎకరాకు సగటున 8 క్వింటాళ్ల చొప్పున 1,47,896 క్వింటాళ్ల దిగుబడి రావాలి. కానీ, భారీ వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిని, ఎకరాకు కేవలం 4 నుంచి 5 క్వింటాళ్ల చొప్పున 73 నుంచి 75 వేల క్వింటాళ్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నెలల తరబడి వర్షాలు కురవడంతో పత్తి చేలల్లో కలుపు మొక్కలు పెరిగి, వాటిని తీసివేసేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వచ్చిందని అంటున్నారు. అధిక వర్షాలకు నల్ల రేగడి నేలల్లో ఏ పనీ చేసే పరిస్థితి లేకపోయిందని, ఈసారి కూడా దిగుబడిపై ఆశలు వదులుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్న పంటను తెగుళ్లు, పురుగులు ఆశించడంతో నివారణకు వేలాది రూపాయల రసాయన మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపారు.

పత్తి మొక్కలు ఎదగలేదు



అధిక వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిచి, గడ్డి ఎక్కువైంది. మొక్కలు ఎదగలేదు. పొడి వాతావరణం లేకపోవడంతో తెగుళ్ల బెడద ఎక్కువైంది. ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకుంటే 4 క్వింటాళ్లు కూడా వచ్చేలా లేదు.

– రేవెళ్లి రాజలింగు, రైతు, బీంరాజ్‌పల్లి, గొల్లపల్లి మండలం

దిగుబడి తగ్గే అవకాశం



జిల్లాలో భారీ వర్షాలతో పత్తి మొక్కల్లో ఎదుగుదల లోపించింది. పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. వర్షాలు కురిసినప్పుడు చేలల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు కాల్వల ద్వారా తీసేస్తూ, సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

– ప్రొఫెసర్‌ శ్రీనివాస్‌ నాయక్‌, వ్యవసాయ కళాశాల, పొలాస

ప్రేమ విఫలమై.. మనసు కలత చెంది..

- రైలుకు ఎదురుగా నిలబడి.. యువతి ఆత్మహత్య

రామగుండం: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం యువకుడి, యువతి మధ్య ప్రేమగా మారింది. అయితే, తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేయడంతో యువకుడు తిరస్కరించాడు. దీంతో మనస్తాపం చెందిన కల్వల శార్వాణి(20) సోమవారం అటివేగంగా వస్తున్న రైలు ఎదుట పట్టాలపై పడుకుని ఆత్మహత్య చేసుకుంది. జీఆర్పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి గంగారపు తిరుపతి కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్‌ కల్వల ప్రదీప్‌కుమార్‌ కూతురు శార్వాణికి రెండేళ్ల క్రితం ఏపీలోని తిరుపతికి చెందిన యువకుడు గంగాధర్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. దీంతో రెండేళ్లుగా ఇద్దరూ చాటింగ్‌ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని గంగాధర్‌ను కోరింది.



శార్వాణి మృతదేహం

అయితే, తనకు ఇప్పటికే వివాహమైందని, పెళ్లి చేసుకోవడం కుదరదని ఆ యువకుడు తిరస్కరించాడు. తీవ్ర మనస్తాపం చెందిన శార్వాని.. సోమవారం ఆ యువకుడితో ఫోన్‌లో మాట్లాడుకుంటూనే.. రామగుండం రైల్వేస్టేషన్‌లోకి చేరుకుంది. వేగంగా వస్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌ రైలును చూసి పట్టాలపై పడుకొని ఆత్మహత్య చేసుకుంది. శార్వాణి ఎన్టీపీసీలోని హోండా షోరూంలో ఉద్యోగిగా పనిచేస్తోంది. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు జీఆర్పీ ఔట్‌పోస్ట్‌ ఇన్‌చార్జి వివరించారు.

కానిస్టేబుల్‌ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌

జగిత్యాలక్రైం: పోలీసు కానిస్టేబుల్‌ ఉద్యోగాల రాత పరీక్షలో అర్హులైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈనెల 12, 13 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలవరకు జిల్లాలోని ధరూర్‌ క్యాంప్‌ ట్రాఫిక్‌ శిక్షణ కేంద్రంలో చేపడుతున్నట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, పోలీసు రిక్రూట్‌మెంట్‌ బోర్డు సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో అటెస్టేషన్‌ ఫారం తీసుకోవాలని, టీఎస్‌ఎల్‌పీఆర్బీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల లాగిన్‌లో వెబ్‌ టెంప్లేట్‌ రూపంలో ఈ ఫాం అందుబాటులో ఉంటాయని, వీటిని డిజిటల్‌గా పూర్తి చేసిన తర్వాత మూడు సెట్లు ప్రింట్‌ తీసుకుని అభ్యర్థులు సంతకాలు చేసి రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు అంటించాలని సూచించారు. జిరాక్స్‌లపై గెజిటెడ్‌ ఆఫీసర్‌తో సంతకం తీసుకోవాలన్నారు. 12న సివిల్‌, ఏఆర్‌, 13న టీఎస్‌ఎస్‌పీ, ఫైర్‌, ఎక్సైజ్‌, ఐటీసీ, ట్రాన్స్‌పోర్టుకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ వెరిఫికేషన్‌ ఉంటుందన్నారు. అభ్యర్థులంతా సకాలంలో హాజరుకావాలని సూచించారు.

కిరాణా దుకాణంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

ధర్మపురి: ఓ కిరాణా దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగి, సామగ్రి పూర్తిగా కాలిపోయింది. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మపురి ప్రభుత్వ జూనియర్‌ కళాశాల సమీపంలోని సర్దార్‌ వల్లభాయ్‌ పటేల్‌ విగ్రహం పక్కనున్న మహంకాళి రాజన్నకు చెందిన కిరాణా దుకాణంలో సోమవారం అగ్ని ప్రమాదం జరిగింది. లోపల డీజిల్‌, పెట్రోలు బాటిళ్లు ఉన్నందున వెల్డింగ్‌ చేస్తుండగా మంటలు అంటుకొని, ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఫైర్‌ స్టేషన్‌కు ఫోన్‌ చేయగా సిబ్బంది వచ్చి, మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో తనకు దాదాపు రూ.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాచర్లగొల్లపల్లికి చెందిన వేముల శివకుమార్‌(25) మద్యానికి బానిసై తల్లిదండ్రులు మందలించడంతో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత నెల 30న పురుగుల మందుతాగిన శివకుమార్‌ పది రోజులపాటు మృత్యువుతో పోరాడి సోమవారం మరణించాడు. ఎస్సై రమాకాంత్‌ తెలిపిన వివరాలు. శివకుమార్‌ కూలీ పనులు చేస్తుండేవాడు. వచ్చిన డబ్బులను మద్యానికే ఖర్చు చేసేవాడు. ఎన్నిసార్లు తల్లిదండ్రులు మందలించినా మార్పు రాలేదు. తాగి ఇంటికొచ్చి గొడవ పడుతున్న శివకుమార్‌ను గత నెల 30న కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురై పురుగుల మందుతాగాడు. స్థానికంగా ప్రథమ చికిత్స చేసినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌ ఎంజీఎంకు తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతునికి తల్లిదండ్రులు జమున–గంగయ్య, భార్య ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దళితబంధును బీఆర్‌ఎస్‌ బంధుగా మార్చారు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌

ధర్మపురి: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు.. అధికార బీఆర్‌ఎస్‌ బంధుగా మారిందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ అన్నారు. అర్హులకు కాకుండా అనర్హులను ఎంపిక చేయడాన్ని నిరసిస్తూ సోమవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దళితబంధు లబ్ధిదారుల ఎంపిక కలెక్టర్‌ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయాల్సి ఉండగా.. బీఆర్‌ఎస్‌ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు చెప్పిన వారికి ఇస్తున్నారని విమర్శించారు. మంత్రి కొప్పుల తన అనుయాయులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌ గణేశ్‌కు సమర్పించారు. నాయకులు ఎస్‌.దినేష్‌, సింహరాజు ప్రసాద్‌, కుంట సుధాకర్‌, సీపతి సత్యనారాయణ, చిలుముల లక్ష్మణ్‌, శ్రావణ్‌, అశెట్టి శ్రీనివాస్‌, మహేశ్‌, స్తంభంకాడి గణేష్‌ తదితరులున్నారు.



ధర్మపురిలో దళితబంధుపై డీటీకి వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

'డబుల్‌' లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు

- ఇద్దరి అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటస్వామి

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలోని నూకపల్లిలో నిరుపేదల కోసం నిర్మించిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపునకు లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటస్వామి తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని హౌసింగ్‌బోర్డు ప్రాంతానికి చెందిన బోగ రాకేశ్‌ డీఈవో కార్యాలయంలో డాటా ఎంట్రీ కంప్యూటర్‌ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బీర్‌పూర్‌ మండల కేంద్రానికి చెందిన మీసేవ ఆపరేటర్‌ మట్టేటి చంద్రశేఖర్‌తో కలిసి డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న అనర్హుల స్థానంలో ఇతర ప్రాంతాలకు చెందిన 57 మందిని లబ్ధిదారులుగా చేర్చారు. వారికి ఇళ్లు వచ్చేలా వివరాలు నమోదు చేశారు. ఇందుకోసం ఒక్కొక్కరి వద్ద రూ.5 వేల నుంచి రూ.60 వేల వరకు సుమారు రూ.4 లక్షలు వసూలు చేశారు. వీరిలో కొంతమంది నగదు ఇవ్వగా, మరికొంత మంది ఫోన్‌పే ద్వారా చెల్లింపులు చేశారు. ఇంకొందరు పట్టాలు చేతికి వచ్చాక ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. నిందితులను అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం ఇందులో ప్రమేయం ఉన్నవారందరిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నటేశ్‌ తదితరులు పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ వెంకటస్వామి

డెంగీ లక్షణాలతో ఒకరి మృతి

గొల్లపల్లి: మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన ఏనుగు రాజేశ్వర్‌ రెడ్డి (43) డెంగీ లక్షణాలతో సోమవారం రాత్రి మృతి చెందాడు. బంధువుల కథనం ప్రకారం రాజేశ్వర్‌ రెడ్డి పది రోజులుగా జ్వరంతో బాధపడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య మేలిని, కుమారుడు యశ్వంతరెడ్డి, కూతురు ప్రజ్ఞా ఉన్నారు. గ్రామంలో మరికొంత మంది కూడా జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామంలో అపరిశుభ్రత పేరుకుపోవడం, మురుగునీటి గుంతల్లో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేసి జ్వరాలను అదుపులోకి తేవాలని, పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.



రాజేశ్వర్‌ రెడ్డి (ఫైల్‌)

అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌

జగిత్యాల: అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్‌ విజయం అందించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని హనుమాన్‌వాడలో మ్యారేజ్‌ బ్యూరో ఓనర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ జిల్లా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు 12.70 లక్షల కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశామని, బీడీ కార్మికులను ఆదుకున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఇష్టానుసారం వాగ్దానాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌ కూతురు రాజేశ్‌, నాయకులు తోట మల్లికార్జున్‌, సత్యం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఈత, తాటికల్లు ఆరోగ్యానికి మంచిది

ఈత, తాటికల్లు ఆరోగ్యానికి మంచిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. సోమవారం గొల్లపల్లి రోడ్‌లో గౌడ సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో 4 కోట్ల ఈత, తాటిమొక్కలు నాటామని, గౌడలకు రూ.2 వేల పెన్షన్‌ ఇవ్వడంతోపాటు, ఎక్సైజ్‌ సర్కిల్‌ను ధర్మపురి నుంచి జగిత్యాలకు మార్చినట్లు తెలిపారు. నీరా పాలసీతో గౌడన్నలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు తిరుపతిగౌడ్‌, నాయకులు రామకృష్ణ, రాజన్న, అంజయ్య, భూమాగౌడ్‌, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

పట్టు పురుగులతో అదనపు ఆదాయం

- వ్యవసాయ కళాశాల అసోసియేట్‌ డీన్‌ భారతి నారాయణ్‌ భట్‌



రైతులతో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు

జగిత్యాల అగ్రికల్చర్‌: పట్టు పురుగుల పెంపకంతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్‌ డీన్‌ భారతి నారాయణ్‌ భట్‌ అన్నారు. జగిత్యాల రూరల్‌ మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలలో షెడ్యూల్డ్‌ కులాల రైతులకు సోమవారం మల్బరి సాగు, పట్టుపురుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో సంప్రదాయ పంటల ద్వారా ఆదాయం అంతంతమాత్రమే వస్తోందని తెలిపారు. అదనపు ఆదాయం కోసం పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులు బృందాలుగా వస్తే శిక్షణ ఇచ్చేందుకు వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులు పట్టుపురుగుల పెంపకంపై దృష్టిపెడితే లాభాలుంటాయన్నారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్‌, ప్రొఫెసర్‌ వి.రత్నాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఈతచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



రాజలింగం మృతదేహం

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్‌ మండలంలోని కన్నాపూర్‌కు చెందిన గుండవేని రాజలింగం(75) అనే గీత కార్మికుడు ఈతచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాజలింగం ఆదివారం సాయంత్రం గ్రామ శివారులోని కల్లు గీసేందుకు ఈతచెట్టు ఎక్కాడు. కాలు జారి, కింద పడటంతో బలమైన గాయాలయ్యాయి. స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనల మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్‌ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడు శేఖర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్‌ తెలిపారు. అంతకుముందు ప్రభుత్వ ఆస్పత్రిలో రాజలింగం కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ ఓదార్చారు.

హత్య కేసులో 9 మందిపై పీడీయాక్ట్‌

జగిత్యాల క్రైం: కోరుట్ల పట్టణంలో కౌన్సిలర్‌ భర్త హత్య కేసులో నిందితులుగా ఉన్న 9 మందిపై పీడీ యాక్ట్‌ అమలు చేసినట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ తెలిపారు. సోమవారం వారికి కరీంనగర్‌ జైలులో సంబంధిత ఉత్తర్వులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు భంగం కలిగించేవారిపై పీడీ యాక్ట్‌ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కోరుట్ల కౌన్సిలర్‌ భర్త లక్ష్మీరాజం హత్య కేసులో ప్రమేయం ఉన్న విత్తనాల నాగరాజు, విత్తనాల తిరుపతి, కాసుల వంశీప్రసాద్‌, పిల్లి సత్యనారాయణ, గుడ్ల విశాల్‌, కాసుల మధుమోహన్‌, మర్త నరసింహ, మారుపాక ప్రభాస్‌, శ్రీరాముల దీపక్‌లకు పీడీ యాక్ట్‌ ఉత్తర్వులు అందజేశామన్నారు. కోరుట్ల పట్టణంలోని కార్గిల్‌ చౌరస్తాలో గత ఆగస్టు 6న శంకర్‌ టీస్టాల్‌ వద్ద కౌన్సిలర్‌ పోగుల ఉమారాణి భర్త లక్ష్మీరాజం హత్యకు గురైనట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, 9 మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరు హత్యతోపాటు, వివిధ నేరాలకు కూడా పాల్పడ్డారన్నారు. పీడీయాక్ట్‌ అమలులో కీలక పాత్ర పోషించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌ రెడ్డి, కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్‌, ఎస్సై కిరణ్‌కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

జగిత్యాలక్రైం: జగిత్యాల అర్బన్‌ మండలంలోని మోతె శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడకు చెందిన మేక ప్రణయ్‌ (28) తన స్నేహితుడైన మోతె గ్రామానికి చెందిన మధును మోతెలో దింపేందుకు సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మోతెకు చెందిన సాయి మరో ద్విచక్ర వాహనంపై ఎదురుగా వచ్చాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మేక ప్రణయ్‌ మృతిచెందాడు. ప్రమాదంలో గాయపడిన మధు, సాయిని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. రూరల్‌ ఎస్సై సదాకర్‌ సంఘటనా స్థలానికి చేరుకుని, విచారణ చేపట్టారు.

చీరలు పట్టివేత

- ముగ్గురిపై కేసు


వేములవాడరూరల్‌: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడరూరల్‌ మండలం ఎదురుగట్లలో ఓ పార్టీ నాయకుడు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారన్న సమాచారంతో సోమవారం ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో దాడిచేసి పట్టుకున్నారు. గ్రామంలోని ఓ ఇంట్లో మహిళా సంఘం సభ్యురాలి ద్వారా చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలియడంతో దాడి చేశారు. అప్పటికే పంపిణీ చేసిన 200 చీరల నుంచి 42 చీరలను రికవరీ చేశారు. ఎన్నికల ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ ఏఈ వెంకటరెడ్డి ఫిర్యాదుతో మారుపల్లి కరుణాకర్‌రెడ్డి, పొన్నం మేఘన, పిట్టల కీర్తనలపై కేసు నమోదు చేసినట్లు వేములవాడరూరల్‌ ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఈ దాడిలో తహసీల్దార్‌ సుజాత, సీఐ కృష్ణకుమార్‌, ఎస్సై మారుతి ఉన్నారు.



పట్టుకున్న చీరలను పరిశీలిస్తున్న అధికారులు

గురుకులంలో ఫుడ్‌ పాయిజన్‌





చికిత్స పొందుతున్న విద్యార్థులు

- ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

మెట్‌పల్లి: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులంలో సోమవారం ఫుడ్‌ పాయిజన్‌ అయ్యింది. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. రాత్రిపూట భోజనం చేసిన తర్వాత ఆరుగురు విద్యార్థులు కడుపు నొప్పికి గురయ్యారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం, రాత్రి (రెండుపూటలా) పులుపు ఆహారం తినడంతోనే అస్వస్థతకు గురై ఉంటారని వైద్య సిబ్బంది తెలిపారు.

యెఖీన్‌పూర్‌లో చోరీ

కోరుట్ల: మున్సిపల్‌ విలీన గ్రామమైన యెఖీన్‌పూర్‌కు చెందిన మిట్టపెల్లి జగన్‌రెడ్డి ఇంట్లో చోరీ జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం జగన్‌రెడ్డి ఇంటికి తాళం వేసి, తన కుటుంబసభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో దొంగలు పడి, 13 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.70 వేలు ఎత్తుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.